

కర్ర గణేష్‌ను కొలుద్దాం
తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలు కర్ర వినాయకులను పూజిస్తారు. దశాబ్దాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. 8లో▸



పోషణ మాసానికి బ్రేక్
అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెతో పోషణ మాసం కార్యక్రమానికి బ్రేక్ పడింది. అంగన్ వాడీ కేంద్రాలు తెరుచుకోక పోషకాహారం అందడం లేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.9 /25.1

వాతావరణం
ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. స్వల్పంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రోజంతా ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న 'భగీరథ' కార్మికుల సమ్మె


దీక్ష శిబిరంలో కార్మికులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్ట రేట్ ఎదుట మిషన్ భగీరథ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ఆదివారం దీక్ష శిబిరంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భగీరథ కార్మికుల జేఏసీ కన్వీనర్ లింగయ్య మాట్లా డుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో గ్రామాల్లో భగీరథ నీటి సరఫరాను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవో 60 అమలు చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మె ఉధృతం చేయడంతోపాటు మాణిక్‌గూడ, దండోరా పంప్ హౌజ్‌లను పూర్తిగా బంద్ చే స్తామని హెచ్చరించారు. నాయకులు ఉపేం దర్, లోకేశ్, ప్రభాకర్, సంతోష్, శంకర్, ప్రకాశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి పంచాయతీ ప రిధిలోని దుబ్బగూడ పోచమ్మ ఆలయం వద్ద రేకుల షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు గోలేటికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అం దించారు. వారు మాట్లాడుతూ పోచమ్మ ఆలయం వద్ద షెడ్డు అందుబాటులో లేకపోవ డంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నా రని పేర్కొన్నారు. బోనాల జాతర సమయం లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంద న్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే షెడ్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గుంపుల విమలేష్, మాజీ సర్పంచ్ తోట లక్ష్మణ్, రెబ్బెన ఎంపీటీసీ పెసరు మధు నయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ స మావేశ మందిరంలో శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి ఆదివారం జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో కలిసి కలెక్టర్ హేమంత్ బోర్కడే జ్యోతి ప్రజ్వలన చేశారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వే శారు. కలెక్టర్ మాట్లాడుతూ విశ్వకర్మ జయం తి వేడుకలు ప్రభుత్వం అధికారికంగా నిర్వ హించడం గొప్ప విషయమన్నారు. కార్యక్ర మంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రమా దేవి, జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, సింగిల్‌విం డో చైర్మన్ అలీబిన్ అహ్మద్, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రామోజీ భాస్కరాచారి, అశోక్‌చారి, రాధాకృష్ణచారి, వేణుగోపాల్, సంజీవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందాలు అమలు చేయాలి


మాట్లాడుతున్న ఉపేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామ పంచాయతీ కా ర్మికులు చేపట్టిన సమ్మె కాలంలో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్య దర్శి బోగే ఉపేందర్ అన్నారు. మండల కేం ద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. జూ లై, ఆగస్టులో పంచాయతీ కార్మికులు సమ్మె చేయగా మంత్రి దయాకర్‌రావు ఇచ్చిన హా మీ మేరకు విధుల్లో చేరారన్నారు. నేటి వరకు ప్రభుత్వం ఒక్క హామీని కూడా అమలు చే యలేదన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షం లో అక్టోబర్‌లో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. నాయకులు శంకర్, సునీల్, ప్రవీణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి

- ప్రభుత్వ విప్ సుంకరి రాజు
- ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం
- కలెక్టరేట్ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణ


మహనీయులకు నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి


మహనీయులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే


జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ సుంకరి రాజు, పక్కన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్రంలో శరవేగంగా అభి వృద్ధి జరుగుతుందని, ప్రభుత్వం అన్నివర్గాల ప్ర జల సంక్షేమ కోసం పథకాలు ప్రవేశపెట్టి విజయ వంతంగా అమలు చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మె ల్సీ సుంకరి రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని స మీకృత కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం నిర్వహించి న జాతీయ సమైక్యతా దినోత్సవానికి ముఖ్య అతిథి గా హాజరయ్యారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు దీపక్ తివా రి, దాసరి వేణు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మె ల్యే ఆత్రం సక్కుతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో జా తీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీసు ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ నాయకులు మహాత్మా గాంధీ, అంబేద్కర్, తెలం గాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ సెప్టెం బర్ 17 తెలంగాణకు చారిత్రాత్మకమైన రోజని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రా ష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. సంక్షేమ పథ కాలతో దేశంలోని అన్నిరాష్ట్రాలకు తెలంగాణ ఆద ర్శంగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. కార్య క్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్మన్ కోనే రు కృష్ణారావు, ఆసిఫాబాద్, సిర్పూర్(యూ) జెడ్పీ టీసీలు అరిగెల నాగేశ్వర్‌రావు, కోవ అరుణ, ఆసి ఫాబాద్, వాంకిడి ఎంపీపీలు మల్లికార్జున్, విమ లాబాయి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'చవితి' ఉత్సవాలకు ముస్తాబు


కౌటాలలో కౌండిన్య గణేశ్ మండలి మండపం


ఆసిఫాబాద్ మండలం మోతుగూడలో..


జిల్లా కేంద్రంలో..

- వాడవాడలా వినాయక మండపాలు
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- నేడు కొలువుదీరనున్న గణనాథుడు
- కలెక్టర్ ఆదేశాలతో ప్రతీ పంచాయతీకి మట్టివిగ్రహాలు పంపిణీ

ఆసిఫాబాద్/కౌటాల: వినాయక చవితి వేడుకలకు జిల్లాలోని వాడవాడలా మండపాలు ముస్తాబవుతు న్నాయి. విద్యుత్ వెలుగులు, ప్రత్యేక అలంకరణల తో నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యా ప్తంగా ఏర్పాటు చేసిన మండపాల్లో గణనాథుడు సోమవారం కొలువుదీరనున్నాడు. నేటి నుంచి నవ రాత్రులపాటు ప్రత్యేక పూజలు అందుకోనున్నాడు. దీంతో పల్లెల్లో పండుగ వాతావరణం కనిపిస్తోంది.

వెయ్యి వరకు విగ్రహాలు..

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్, రెబ్బెన తదితర ప్రాంతాల్లో నవరాత్రులు భక్తిశ్రద్ధల తో నిర్వహించనున్నారు. జిల్లాలో దాదాపు 1000 వరకు గణేశుడి విగ్రహాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని పోలీసు అధికారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోనే దాదాపు 50కి పైగా మండపాలు ఏ ర్పాటు చేయనున్నారు. వారం రోజులుగా గణేశ్ ఉ త్సవ నిర్వహణ కమిటీల సభ్యులు ఏర్పాట్లలోనే ని మగ్నమయ్యారు. మండపాల వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడంతోపాటు పందిర్లు, షామీయానా లు వేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. కొంత మం ది ఆసిఫాబాద్ పట్టణం నుంచే కాకుండా మంచి ర్యాల, బెల్లంపల్లి వంటి ప్రాంతాలకు వెళ్లి ప్రత్యేక మైన, వివిధ ఆకారాల్లో ఉన్న విగ్రహాలను కొనుగో లు చేశారు. మరికొంత మంది సరిహద్దులోని చం ద్రపూర్‌కు సైతం వెళ్లి విగ్రహాలు తెచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. పీవోపీ విగ్రహ తయారీ ముడిస రుకు, కెమికల్, రంగుల ధరలు భారీగా పెరగడం తో తయారీదారులు ప్రతిమల ధరలు సైతం గతే డాది కంటే మూడు రెట్లు పెంచి విక్రయిస్తున్నారు. ఆదివారం నుంచే మండపాల వద్దకు తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో పోలీసులు శాం తికమిటీ సమావేశాలు నిర్వహించి నిర్వాహకులకు అవగాహన కల్పించారు. విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశా నిర్దేశం చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించేందుకు సహకరించాలని, అత్యవసర సమయంలో కంట్రోల్‌రూం 87126 70557, డయల్ 100 నంబర్లకు సమాచారం అం దించాలని సూచించారు. కాగా.. వినాయక చవితి వేడుకల నేపథ్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ ప్రజలతో కిటకిటలాడింది. ప్రజలు ఏక దంతుడి విగ్రహాల కొనుగోలుతోపాటు పూజా సామగ్రి కొనుగోలు చేశారు. వివేకానంద చౌక్ వద్ద సోమవారం వేకువజాము నుంచే పూజకు అవసర మైన సామగ్రి విక్రయాలు సాగిస్తారు.

మట్టి వినాయకులకు జై

పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య నివారణ సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతోపాటు అధికారులు, ప్రజాప్ర తినిధులు శనివారం మట్టి గణపతులు ఉచి తంగా పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి హాని ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. దీంతో కొంతమంది మట్టివిగ్రహాలను పూజించేందుకు మొగ్గు చూపుతున్నారు. పర్యావరణ హితమైన విగ్ర హాలను ప్రోత్సహించేందుకు జిల్లా కేంద్రంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పూజ ఇలా..

మంటపాల వద్ద తొమ్మిది రోజులపాటు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కనుల పండువగా భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు. వినాయక చవితి రోజు విఘ్నేశ్వరుడికి 21 రకాల పూలతో పూజలు చేస్తారు. ఔషధ గుణాలు కలిగి ఉండే ఆకులు, పూల తో పూజించడం పర్యావరణానికి మేలు చేస్తుందని చెబుతారు. మాచి, పత్రి, గరిక, ఉత్తరేణి, ములక, ఉమ్మెత్త, తులసి, మారెడు, రేగు, మామిడి, గన్నేరు, ధవనం, జాజిమల్లె, తెల్లమద్ది, దేవదారుపత్రం, దానిమ్మతోపాటు పలు రకాల పత్రాలతో గణేశుడికి పూజలు నిర్వహిస్తారు. ఉండ్రాళ్లు, లడ్డూలు, పాయసం వంటివి నైవేద్యంగా సమర్పిస్తారు.

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

- ప్రభుత్వ విప్‌కు వినతిపత్రం అందించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు


సమస్యలు విన్నవిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: తమ సమస్యలను రాష్ట్ర ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ సమగ్రశిక్ష ఉ ద్యోగులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ సుంకరి రాజుకు ఆదివారం వినతిపత్రం అందించారు. జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న వారు.. తెలం గాణ సమైక్యతా దినోత్సవానికి ముఖ్య అతిథిగా వ చ్చిన విప్‌కు సమస్యలు విన్నవించారు. ఈ సంద ర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు 21 రోజులు గా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఏ ళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న తమ న్యాయ మైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఎమ్మా ర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య వీరి సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంతోష్, రమేశ్, మోహన్, సందీప్, మహేశ్, నగేశ్, రవి, స్వప్న, మమత, తిరుమల తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- మున్సిపల్ కమిషనర్ అంజయ్య


చెత్త తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో ప్రతిఒక్కరూ పరిస రాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిష నర్ అంజయ్య అన్నారు. స్వచ్ఛత లీగ్‌లో భాగంగా ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై చెత్త తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల వ్యర్థాలు పేరుకుపోతే రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచిం చారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయ న్నారు. అలాగే ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ రమా దేవి, మేనేజర్ పెద్దింటి క్రాంతి, శానిటరీ ఇన్‌స్పె క్టర్లు శంకర్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విలీనం కాదు.. విమోచనం


బీజేపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్
- పార్టీ కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవం

ఆసిఫాబాద్: సెప్టెంబర్ 17 దేశంలో తెలంగాణ విలీ నమైన రోజు కాదని.. తెలంగాణ విమోచన దినోత్స వమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో ని పార్టీ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ వి మోచన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భం గా బీజేపీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ నుంచి జిల్లా కేం ద్రంలోని జన్కాపూర్‌లోని పార్టీ కార్యాలయం వర కు మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంత రం పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్క రించారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సంద ర్భంగా చేతివృత్తులు, సంప్రదాయ కళలతో జీవనం సాగిస్తున్న వారికి అండగా నిలిచేందుకు కేంద్ర ప్ర భుత్వం పీఎం విశ్వకర్మ యోజన అనే సరికొత్త పథ కానికి శ్రీకారం చుట్టగా.. పథకం ప్రారంభోత్సవా న్ని జిల్లా కార్యాలయం నుంచి పార్టీ నాయకులు వీక్షించారు. అనంతరం మోదీ జన్మదినం సందర్భం గా కేక్ కట్ చేశారు. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడు తూ నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం తెలంగాణ వ్యాప్తంగా వేలాది మంది అసువులు బా సారని గుర్తు చేశారు. రాష్ట్రంలో విమోచన ది నోత్స వాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చే శారు. కార్యక్రమంలో ఆత్మారాం నాయక్, శ్రీశైలం, కొట్నాక విజయ్, మురళీధర్, లెండిగూరె శ్యాం రావు, ఆంజనేయులుగౌడ్, ముత్తు అశోక్‌కుమార్, బాలకృష్ణ, సొల్లు లక్ష్మి, కుమ్మరి తిరుపతి, కుడ్రం వందన, నర్సింహారెడ్డి, జయరాజ్, సూర్యప్రకాశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

28న గణేష్ నిమజ్జనం


ఆలయంలో సమావేశమైన అర్చకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఈ నెల 28న గణేష్ నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని అర్చక సం ఘం పట్టణ అధ్యక్షుడు శిరీశ్‌శర్మ తెలిపారు. పట్టణం లోని కేశవనాథ ఆలయంలో ఆదివారం సాయం త్రం భార్గవ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో సమావే శమయ్యారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్య క్రమం తేదీని నిర్ణయించారు. జిల్లా కేంద్రంలోని గణేష్ మండళ్ల కమిటీలు సహకరించాలని కోరారు.

కర్ర గణేష్‌ను కొలుద్దాం


అలంకరణకు ముందు భోసి కర్ర గణేషుడు

- సరిహద్దులో పర్యావరణహితం
- 1948–50 నుంచి కర్ర విగ్రహాలే..
- ఊరంతా ఒకటే ప్రతిమకు పూజ
- మన ఊళ్లు, మరాఠీ పల్లెల్లో ఆనవాయితీ

నిర్మల్: గణేష్ ఉత్సవాల్లో ఒక్కో ప్రాంతానికి ఒక్కో విశేషం ఉంటుంది. అందులో తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి మరింత ప్రత్యేకత ఉంది. ఇక్కడ నవరాత్రుల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనిక రంగులు లేకుండా, కనీసం మట్టితోనూ సంబంధం లేకుండా కర్ర వినాయకులు కొలువు దీరుతారు. ఇలా నిన్న మొన్నటి నుంచి కాదు..ఏడెనిమిది దశాబ్దాలుగా అవే వినాయక ప్రతిమలు కొలువుదీరడం విశేషం. నిర్మల్–మహారాష్ట్ర సరిహద్దులోని కర్ర గణేశుడి కథేందో తెలుసుకుందాం.


అలా మొదలై..

స్వాతంత్య్ర ఉద్యమకాలంలో ప్రజలను ఏకతాటిపైకి తెచ్చేందుకు మహారాష్ట్రలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రా రంభించారు. ఆ మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో స్వాతంత్య్రానికి పూర్వమే కలరా, ప్లేగు వ్యాధులు ప్రబలడంతోపాటు కరువు కాటకాలు ఏర్పడ్డాయి. ప్రజలకు తాగడానికి కూడా నీరు దొరక ని పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాంటి సందర్భంలో గణేష్ నవరాత్రులు వచ్చాయి. అప్పుడు అక్కడి ప్రజలు నిమజ్జనం చేసే పరిస్థితులు లేనందున నీటితో అవసరం లేకుండా ఉండేలా కర్రతో గణపతిని చే యించాలని నిశ్చయించారు. ముందుగా తెలంగాణ సరిహద్దు పక్కనే మహారాష్ట్రలోని భోకర్ తాలూకా లోని పాలజ్ అనే గ్రామస్తులు 1948లో నిర్మల్‌లో కొయ్యబొమ్మలు చేసే నకాశీ కళాకారుడైన గుండాజీవర్మను కలిశారు. ఆయన నిష్ఠతో ఒకే కర్రతో, సహజసిద్ధమైన రంగులతో అందంగా గణపతిని తయారు చేసి ఇచ్చారు. ఆ ఊరంతటికీ ఆ కర్ర గణపతినే ప్రతిష్ఠించడంతో కొంతకాలానికే కరువు కాటకాలు, వ్యాధులు దూరమయ్యాయి. అలా..కర్ర గణపతి రాకతోనే తమ ఊరు మారిందని నమ్ముతూ దాదాపు ఏడెనిమిది దశాబ్దాలుగా అదే కర్ర వినాయకుడిని ప్రతీ ఏడాది ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. నవరాత్రులు ముగియగానే కాసిన్ని నీళ్లు చల్లి, మళ్లీ బీరువాలో భద్రపరుస్తున్నారు.


మహారాష్ట్రలోని పాలజ్ కర్ర వినాయకుడు

మన ఊళ్లు..మరాఠీ పల్లెల్లో..

కర్ర గణపయ్య కేవలం పాలజ్‌కే పరిమితం కాలే దు. సరిహద్దులోని పలు తెలంగాణ పల్లెలు, మరా ఠీ ఊళ్లల్లోనూ అదే ఆనవాయితీ ఏర్పడింది. ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకాలోని చిక్లీ, నిర్మల్ జిల్లాలోని తానూరు మండలం భోసి, కుభీర్ మండలంలోని కుభీర్, పార్డీ, భైంసా మండలం మాటేగాంలలో దశాబ్దాలుగా కర్ర గణేషులే కొలువుదీరుతున్నాయి. ఆరేళ్ల నుంచి జిల్లా కేంద్రంలోని విశ్వకర్మ సంఘంలోనూ కర్ర గణపతికి పూజలు చేస్తున్నారు.


మహారాష్ట్రలోని చిక్లీలో కర్ర గణేషుడు(ఫైల్)

ఎలా వెళ్లాలంటే..

దేశంలో ఎక్కడా లేనివిధంగా కర్ర గణేషులను ప్రతిష్ఠించి పూజించడం ఇక్కడే ఉంది. పర్యావరణ హితుడిగానే కాకుండా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే సత్యదేవుడిగానూ ఈ కర్ర గణేషులు నిలుస్తున్నాయి. ఈ కారణంగా వినాయక నవరాత్రుల్లో వేలాది భక్తులు ఈసరిహద్దు గ్రామాలకు తరలివస్తున్నారు. ఒక్క పాలజ్‌లోనే నవరాత్రుల్లో రోజుకు కనీసం పదివేల మంది దర్శించుకోవడం గమనార్హం.

- హైదరాబాద్ నుంచి పాలజ్ మొత్తం 286కి.మీ దూరం ఉంటుంది. కామారెడ్డి, డిచ్‌పల్లి, నిజామాబాద్, బాసర మీదుగా భైంసా చేరుకోవాలి. అక్కడి నుంచి 23 కి.మీ దూరంలో పాలజ్ ఉంటుంది. భైంసా నుంచి తెలంగాణ, మహారాష్ట్ర బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉటాయి.
- తానూరు మండలంలోని భోసిలో వరసిద్ధి వినాయకుడిగా పూజలందుకుంటున్నాడు. ఇక్కడి కర్ర గణపతిని దర్శించుకోవాలంటే భైంసా నుంచి 11 కి.మీ వెళ్లాలి. మాంజ్రి, భోసి ఎక్స్‌రోడ్డు గ్రామానికి చేరుకోవచ్చు. భైంసా–భోకర్ వెళ్లే ప్రధాన రహదారిలో భోసి ఎక్స్‌రోడ్డు వస్తుంది. ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంటుంది.
- మహారాష్ట్రలోని చిక్లీ కర్ర గణేశ్‌ను దర్శించుకోవాలంటే భైంసా నుంచి దాదాపు 25 కి.మీ ఉంటుంది. మహాగాం, పార్డి(బి), మర్లగొండల మీదుగా చిక్లీ చేరుకోవచ్చు. భైంసా–షివిని బస్సు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.
- భైంసా నుంచి నిర్మల్ రహదారిలో కేవలం 5 కి.మీ దూరంలో మాటేగాం కొరడి గణపతిని ఉంటుంది.

‘ఆదివాసీ సంస్కృతి ఎంతో గొప్పది’


గుస్సాడీ బృందం సభ్యులు

జైనూర్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని సౌత్ కల్చరల్ డైరెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో గుస్సాడీ నృత్యం ప్రదర్శించారు. గుస్సాడీ బృందం అధ్యక్షుడు కనక సుదర్శన్, మార్లవాయి ఉప సర్పంచ్ ధర్మేందర్, గుస్సాడీ బృందం సభ్యులు తదితరులున్నారు.

‘ఎల్లంపల్లి’కి జలకళ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ భారీనీటితో కళకళలాడుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను ఆదివారం రాత్రి వరకు 19.500 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో కింద ఎగువ ప్రాంతాల నుంచి 12 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి చేరుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 276 క్యూసెక్కులు, ప్రాజెక్ట్‌లోని రెండు గేట్లు ఎత్తి 11 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ పట్టివేత

రెబ్బెన: రెబ్బెన రేంజ్ పరిధిలోని కంపార్ట్‌మెంట్ నంబర్ 304 నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా రాయి (బోల్డర్) తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు గోలేటి బీట్ అధికారి భుక్య రవి తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన ట్రాక్టర్ గోలేటికి చెందిన దుర్గం ఇస్తారీకి గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా ఒకరు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: అనుమానాస్పదంగా ఒకరు మృతిచెందినట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా భీమిని మండలం చిన్నగుడిపేటకు చెందిన ముదిగిరి భీరయ్య (45) కొన్నిరోజులుగా కాగజ్‌నగర్ మండలం కడంబా శివారులో గొర్రెల మంద ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. మండలంలోని ఆరెగూడ శివారులోని మామిడిచెరువులో ఆదివారం భీరయ్య అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నాడు. భీరయ్య సోదరుడు ఐలయ్య ఫిర్యాదుతో మృతుడి భార్య దేవక్క, బావమరిది పర్వతాలు, మామ శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరువర్గాలపై కేసు

భీమిని: మండలంలోని వీగాం గ్రామంలో పాత పగలతో పరస్పరం దాడులు చేసుకున్న ఇరువర్గాలపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు కన్నెపల్లి ఎస్సై నరేశ్ తెలిపారు. గ్రామంలో ఈనెల 15న సాయంత్రం దొడ్డి మహేశ్, రాజలింగు, మేకల మల్లేశ్, మేకల అంజన్నలు రెండు గ్రూప్‌లుగా విడిపోయి బస్టాండ్ వద్ద ఒకరిపై ఒకరు దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో ప్రజలకు ఆటంకం కలిగించడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా పంచాయతీ బారెగూడకు చెందిన మోర్లె పద్మ అదృశ్యం కావడంతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పద్మ ఈనెల 16 నుంచి నుంచి కనిపించడం లేదు. భర్త వసంత్ వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో పద్మ, కుమారుడు సంజీవ్ ఉన్నారు. పని నుంచి వసంత్ ఇంటికి వచ్చాడు. భార్య పద్మ కనిపించకపోవడంతో కుమారుడిని అడగగా మధ్యాహ్నం పొలానికి వెళ్లి తిరిగి రాలేదని చెప్పాడు. దీంతో వసంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉధృతంగా ప్రాణహిత నది


పంట పొలాల్లో చేరిన నీరు


వేమనపల్లిలో నీటమునిగిన పత్తి పంట

వేమనపల్లి: వర్షాలు తగ్గుముఖం పట్టాయి. కాని ప్రాణహిత నదికి వరద పోటెత్తుతోంది. దిగువన మేడిగడ్డ వద్ద వరద వెళ్లకుండా కొన్ని గేట్లు మూసి వేయడంతో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. పెన్‌గంగ, వార్ధానది, వైన్ గంగలపై ఉన్న ప్రాజెక్టుల నుంచి నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో గంట గంటకు వరద ఉధృతి పెరుగుతోంది. ఈక్రమంలో వేమనపల్లి పుష్కర ఘాట్, ముల్కలపేట–రాచర్ల మధ్యన ఉన్న బొందచేను ఒర్రెలు వరద నీటితో మునిగిపోయాయి. వరద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నాటుపడవలు ఆపించారు. ప్రాణహిత వరదతో వేమనపల్లి, కల్మలపేట, ఒడ్డుగూడం, రాచర్ల శివరాలు సుమారు 80 ఎకరాల్లో పత్తి నీటమునిగింది.

నీట మునిగిన పంటలు

బెజ్జూర్: ప్రాణహిత ఉప్పొంగి పంటలు నీటమునిగాయి. కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా మహారాష్ట్రలోని ఆయా ప్రాజెక్టుల గేట్లను వదలడం ద్వారా ప్రాణహితకు ఆదివారం వరద నీరు చేరింది. దీంతో మండలంలోని తలాయి, తిక్కపల్లి, భీమారం, పాపన్నపేట. సోమిని, మొగవెల్లి తదితర గ్రామాల ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లో పంట పొలాల్లో నీరు చేరింది. పంటలు నీట మునిగాయి. ప్రాణహిత ఉప్పొంగితే తిక్కపల్లి, భీమారం, తలాయి గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకునే అవకాశాలు ఉన్నాయని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూఢనమ్మకాలు వీడండి

నెన్నెల: సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో ప్రజలు మూఢనమ్మకాలను విడనాడాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య సూచించారు. శనివారం రాత్రి నందులపల్లిలో మూఢనమ్మకాలను తొలగించి చైతన్యపర్చడం కోసం పోలీసుల ఆధ్వర్యంలో కళాబృందంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏసీపీ మాట్లాడుతూ ప్రతీ దానికి ఒక శాస్త్రీయ కారణం ఉంటుందని, దానిని ప్రజలు మంత్రశక్తిగా భావించడం జరుగుతుందని, అలాంటివి నమ్మకూడదని తెలిపారు. గ్రామాల్లో యువత డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని కళాబృందం ఆటపాటలతో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్యాంపటేల్, పోలీసులు పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ

యువకుడి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న శ్రీనివాస్

కడెం: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పంచితి శ్రీనివాస్ శనివారం రాత్రి గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని వస్తున్నాడు. చిన్నబెల్లాల్ సమీపంలోని గోదావరి వంతెన వద్ద పోలీసులు డ్రంకెన్ డ్రైవ్, వాహనాల తనిఖీ చేపట్టారు. శ్రీనివాస్ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలో మద్యం తాగినట్లు తేలింది. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేస్తామన్నారు. అంత్యక్రియలకు వెళ్లి మద్యం తాగానని, తనను విడిపెట్టాలని ప్రాధేయపడ్డాడు. పోలీసులు వినకుండా అతడి వివరాలు తెలుసుకుని విడిచిపెట్టారు. శ్రీనివాస్ ఇంటికి చేరుకుని పురుగు మందు డబ్బాతో వెళ్లి పోలీసులను అడ్డగించాడు. పురుగు మందు తాగేందుకు యత్నించగా వారు అడ్డుకున్నారు. కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌ను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

పెంచికల్‌పేట్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. ఎస్సై కొమురయ్య కథనం ప్రకారం.. దహెగాం మండలం తెనుగుపల్లి గ్రామానికి చెందిన గోపు పర్వతాలు(48) కొన్నిరోజులు గా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తాగిన మైకంలో ఆదివారం పెంచికల్‌పేట్ మండలం చేడ్వాయి సమీపంలోని పెద్దగుట్ట వద్దకు వచ్చాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతురాలి భార్య కళావతి ఫిర్యాదుతో కేసు ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సమస్యలు పరిష్కరించాలని సంఘం (బీఆర్ఎస్ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్య అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాంబాబు యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్, కార్యదర్శి వేణు, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజేందర్, పవన్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.